క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గోపాలపురం: దొండపూడి గ్రామంలోని శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామునే అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. ఆలయ నిర్వాహకుడు మద్దాల కాశీవిశ్వనాథ సనారీ, స్థానిక నాయకులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిగర్ల సువర్ణరాజును ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. కోరుమామిడికి చెందిన సైతు రామేశ్వరానికి, కోట సత్యవతికి 2020లో వివాహమైంది. ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భార్య సత్యవతి తిరిగి రాలేదని భర్త రామేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా బోధన

కొవ్వూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ విద్యా బోధన చేయాలని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు సూచించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉన్నత విద్యను ఎంతగా మార్చుతుందో, కృత్రిమ మేధస్సు అధ్యాపకులను భర్తీ చేస్తుందా అనే అంశాలపై రెండు రోజు నుంచి శుక్రవారం ఈ కళాశాలలోని ఆంగ్లం, కంప్యూటర్ సైన్స్ విభాగాల అధ్యాపకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు నిర్ణయంపై హర్షం

కొవ్వూరు: ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫైల్ పై సంతకం చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసినందుకు శుక్రవారం కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజయ విహార్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కోడూరి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లపూడి: ఆంధ్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ 2002- 2004 బ్యాచ్ ఆర్థిక శాస్త్రం, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 16న విశాఖ, ఆంధ్రా యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ భవనంలో జరుగుతుందని పూర్వ విద్యార్థి, ప్రోగ్రాం ఆర్గనైజర్, ఏఎస్వో జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద అల్యూమినా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్, వీఆర్వోలు నరేష్, లీలావతి, వీఆర్ఏ సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల జోరు

- వసతులు, బోధనపై అధ్యాపకుల ఇంటింటా ప్రచారం
- బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాల సందడి
- ఫలిస్తున్న అధ్యాపకుల కృషి



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అధ్యాపకులు

నిడదవోలు: ఇటీవల టెన్త్ పాసైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేర్పించాలంటూ అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు. తమ కళాశాలల్లో అత్యుత్తమ బోధన, ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయంటూ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వారి ప్రచారం సత్ఫలితాలు ఇస్తోంది. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అడ్మిషన్లు వెల్లువెత్తుతున్నాయి. అధ్యాపకులు సమీప గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, విశాలమైన లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని వివరిస్తున్నారు. నిడదవోలు పట్టణంలోని వివిధ హైస్కూళ్లకు, గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి టెన్త్ పాసైన విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకొని ఓ సారి తమ కళాశాలను సందర్శించి నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు. కళాశాలలోని వసతులు, ప్రయోజనాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మే 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభించారు. టెన్త్ పాసైన విద్యార్థులు తమ మార్క్స్ మెమో, ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి అడ్మిషన్లు పొందుతున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో రెండు మాధ్యమాలతో పాటు ఒకేషనల్ ఓ ఏ గ్రూపు కూడా అందుబాటులో ఉంది. ఇప్పటివరకూ 120 ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తి చేశారు. ఫస్టియర్ నుంచి సెకండియర్‌కు ప్రమోట్ అయిన 200 మంది విద్యార్థులు ప్రస్తుతం ఈ కళాశాలలో చదువుతున్నారు. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 320 మంది ఇక్కడ విద్య అభ్యసిస్తున్నారు. అదే విధంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులైన సీఎస్ఈ, ఈటీ, ఈఈటీ, ఎంఅండ్ ఏటీ కోర్సులు అందుబాటు ఉన్నాయి. ఇక్కడ కూడా అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి.



నిడదవోలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ గీతాంజలి

కార్పొరేట్ స్థాయి వసతులు



కళాశాలలో అత్యుత్తమ బోధనతో పాటు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్యూరిఫైడ్ మంచినీటి సదుపాయం, 14 తరగతి గదులు, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన లేబరేటరీలు అందుబాటులో ఉన్నాయి. నిష్ణాతులైన 13 మంది అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, విశాలమైన క్రీడాస్థలం ఉన్నాయి. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు తమ టెన్త్ పాసైన మార్క్ మెమో ఆధార్ తీసుకు వచ్చి అడ్మిషన్లు తీసుకోవాలి.

– **బట్టు గీతాంజలి**, ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నిడదవోలు

29న కొవ్వూరులో లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు: ఈ నెల 29న కొవ్వూరులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్. శ్రీనివాసరావు ప్రకటించారు. స్థానిక కోర్టు హాల్లో శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. పరిష్కరించు కోదగిన అన్ని కేసులనూ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చూడాలని ఆయన సూచించారు. ఎక్కువ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. రోజూ ప్రీ సిట్టింగ్ నిర్వహించి కేసులను రాజీ చేస్తున్నామని ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, వీవీ సుబ్బారావు, టి.చిట్టిబాబు, టి.ప్రభాకరరావు, ఈ. గోపాలకృష్ణ, ఉప్పల కృష్ణారావు, బొబ్బా భారతి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు వినూత్న కార్యక్రమం



దూబచర్ల గ్రామస్తులకు సూచనలిస్తున్న నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు



ఉండ్రాజవరం మండలం వెలగదుర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు దూబచర్ల గ్రామస్తులకు సూచించారు. డ్రైడే, ఫ్రైడే సందర్భంగా దోమల నివారణపై దూబచర్ల వాసులకు ఆయన పలు సూచనలు చేశారు. దోమల నివారణ ద్వారా అనేక వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి బి.రత్నం ఆధ్వర్యంలో గ్రామంలోని ఇళ్ల వద్ద గల సెప్టిక్ ట్యాంకుల గొట్టాలకు మెష్‌లు ఏర్పాటు చేపట్టారు. సర్పంచ్ తాడిగడప బాలయ్య నేతృత్వంలో చురుగ్గా సాగుతున్న ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులతో పాటు సచివాలయ సిబ్బంది కూడా భాగస్వాములైనట్టు డాక్టర్ గంగాధరరావు తెలిపారు. సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు పి.సత్యనారాయణ, ఆరోగ్య సహాయకులు కొక్కిరపాటి సుబ్బారావు, రాఘవేంద్రరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్‌కే జరీనా,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణ మనందరి బాధ్యత

ఉండ్రాజవరం: దోమల నివారణ మనందరి బాధ్యత అని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్వీ ప్రసాద్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా మండలంలోని వెలగదుర్రు గ్రామంలో శుక్రవారం మలేరియాపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెంది, వ్యాధులను కలగజేస్తాయన్నారు. దోమలు కుట్టడం ద్వారా మనుషులకు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలసిన పలు సంఘాల నాయకులు



నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలసిన యూటీఎఫ్ నాయకులు



కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడిని కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

సత్కరించిన నాయీబ్రాహ్మణ సంఘ నేతలు

నల్లజర్ల: గోపాలపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన మద్దిపాటి వెంకట్రాజును యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నల్లజర్లలోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించారు. పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే జీఓ నంబర్ 117ను రద్దు చేసి, హైస్కూళ్లలో విలీనం చేసిన 3,4,5 తరగతులను మళ్లీ ప్రాథమిక పాఠశాలల్లో కలిపి వాటికి పూర్వ వైభవం తీసుకు రావాలని ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు కోరారు. ఉపాధ్యాయుల కొరతను త్వరలో డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ మనోహరకుమార్, నల్లజర్ల భవానీ మండల శాఖ అధ్యక్షుడు ఎస్ఎఫ్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి బండి కిశోర్, గుజ్జుల చిట్టిబాబు, పీవీ అప్పారావు, జే.నాగేశ్వరరావు, కేఎస్ డేవిడ్‌రాజు, పలువురు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును శుక్రవారం నల్లజర్లలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దేవరపల్లి తహసీల్దార్ వైవీఎస్ ఆచారి, డిప్యూటీ తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, సిబ్బంది ఎమ్మెల్యే వెంకట్రాజును కలిసిన వారిలో ఉన్నారు.

ముప్పిడిని కలసిన అంగన్‌వాడీ వర్కర్లు

తాళ్లపూడి: కొవ్వూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వెంకటేశ్వరరావును మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు శుక్రవారం కొవ్వూరు పట్టణంలో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ప్రభుత్వంలో తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మలకపల్లి సెక్టార్ పరిధిలోని ఆర్.జ్యోతి, డి.దయామణి, ఎన్.రేవతి, అరుణ, బుజ్జమ్మ, అనురాధ, మదీనా ఉన్నారు.

కొవ్వూరు: ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును నాయీబ్రాహ్మణ సంఘ నేతలు సత్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేడూరి వీర్రాజు ఆధ్వర్యంలో సంఘ కొవ్వూరు శాఖ గౌరవాధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు బొందపల్లి నరసింహారావు, అధ్యక్షుడు చింతలపూడి ప్రసాద్, కోశాధికారి పొన్నాడ సూరిబాబు, మేడూరి వెంకట్రావు, ఇతర సభ్యులు కలసి ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్‌లను సంఘ నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

సీసీ రోడ్డుపై పగుళ్లతో ప్రమాదాలు



బీటలు తీసిన ఉండ్రాజవరం- తణుకు ఆర్ అండ్ బీ సీసీ రోడ్డు

ఉండ్రాజవరం: ఇక్కడి నుంచి తణుకు వెళ్లే ఆర్ అండ్ బీ సీసీ రోడ్డుపై పెట్రోల్ బంక్ వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. దాంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 17 ఏళ్ల క్రితం ఉండ్రాజవరం నుంచి తణుకు వరకూ సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఈ సీసీ రోడ్డు వేశారు. మొదటి దఫాలో పాలంగి నుంచి తణుకు వరకూ నిర్మించిన సీసీ రోడ్డు అక్కడక్కడా బీటలు తీసింది. ఉండ్రాజవరం పెట్రోల్ బంక్ దగ్గర సీసీ రోడ్డు బీటలు వారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బీటలు తీసిన ఈ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ రోడ్డు దుస్థితి గురించి గతంలో ఎన్నోసార్లు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోలేదని ఉండ్రాజవరం, పాలంగి తదితర గ్రామాల ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి బీటలు తీసిన చోట తారు వేయాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాల ఆవరణలో వన మహోత్సవం



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

గోపాలపురం: బాల్యం నుంచీ విద్యార్థులు మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని, దీనివల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని ఎంఈఓ జి. శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాల్లోనూ పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఇంటి వద్ద ఖాళీ ప్రదేశాల్లో కూడా అనువైన మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎ. మహేశ్వరరావు, హెచ్ఎం టీవీ సత్యనారాయణ, హితయతుల్లా, సీఆర్పీ కొయ్య నాగరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వారి మధ్య సయోధ్య మూన్నాళ్ల ముచ్చటేనా!

నల్లజర్ల: సార్వత్రిక ఎన్నికల వరకూ గోపాలపురం నియోజకవర్గ తెలుగుదేశంలో మద్దిపాటి వెంకట్రాజు, ముళ్లపూడి బాపిరాజు వర్గాల మధ్య సంబంధాలు ఉప్పు.. నిప్పు మాదిరిగా ఉండేవి. అధిష్టానం ఎంపిక చేసిన టీడీపీ అభ్యర్థి వెంకట్రాజును ముళ్ళపూడి వర్గం తొలుత వ్యతిరేకించిన విషయం కూడా తెలిసిందే. చివరకు చంద్రబాబు సూచనలతో రెండు వర్గాలూ ఎన్నికల్లో ఒక్కటై పని చేశాయి. అయితే ఈ ఐక్యత ఇలాగే కొనసాగుతుందా అని అప్పట్లోనే చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారు. చివరకు వారు అనుకున్నట్టుగానే జరిగింది. ఎమ్మెల్యే వెంకట్రాజు నల్లజర్ల షిర్డీ సాయి ఆలయంలో గురువారం క్షీరాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ఆ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కండెపు వెంకటరత్నం ఇంటికి వెళ్లారు. తర్వాత టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మలపూడి ప్రసాద్ ఇంటికి వెళ్లారు. వీరందరూ ఎన్నికల ముందు ఎమ్మెల్యే మద్దిపాటి వర్గీయులు. వారిని ఎమ్మెల్యే కలసిన విషయం తెలిసిన బాపిరాజు అగ్గి మీద గుగ్గిలమయ్యారని అంటున్నారు. ఎవరికి చెప్పి నాయకుల ఇళ్లకు వెళ్తున్నారంటూ ఎమ్మెల్యే మద్దిపాటి తీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను చల్లబరిచేందుకా అన్నట్టు బాపిరాజు వర్గీయుడైన అలపాటి రామకృష్ణ ఇంటికి కూడా మద్దిపాటి వెంకట్రాజు వెళ్లారని ఆ పార్టీ కార్యకర్తలు తెలిపారు. వీరిద్దరి కలయిక మూన్నాళ్ల ముచ్చటేనని జనం చర్చించుకుంటున్నారు.

పాఠశాలలకు చేరుకున్న స్టూడెంట్ కిట్లు



దేవరపల్లిలో పాఠశాలల హెచ్ఎంలకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

దేవరపల్లి: నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లు మండల కేంద్రాలు ఇప్పటికే చేరుకున్నాయి. ఈ కిట్లను మండల కేంద్రమైన దేవరపల్లి నుంచి శుక్రవారం పాఠశాలలకు చేరవేస్తున్నారు. ఎంఈఓలు ఎం.తిరుమదాస్, కేఆర్ఎస్‌పీవీ అప్పారావు వాటిని ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలో 45 పాఠశాలలకు 45,075 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకూ 37537 పుస్తకాలు వచ్చాయన్నారు. వాటిలో 8,9,10 తరగతులకు 22,270 పుస్తకాలు, 1 నుంచి 7వ తరగతులకు 15,267 పుస్తకాలు వచ్చినట్టు ఎంఈఓ తిరుమలదాస్ తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన పుస్తకాలను పాఠశాలలకు పంపించినట్టు వివరించారు. స్టూడెంట్ కిట్‌లో భాగంగా పాఠ్యపుస్తకాలు, నోట్స్ పుస్తకాలతో పాటు విద్యార్థులకు 3479 బెల్టులు, 5,233 స్కూలు బ్యాగులు, 33,218 నోట్స్ పుస్తకాలను పాఠశాలలకు పంపించినట్టు చెప్పారు. 5233 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాం రావలసి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో యూనిఫాం వస్తుందని తెలిపారు. 5233 మంది విద్యార్థులకు షూస్ వచ్చి సిద్ధంగా ఉన్నాయని, యూనిఫాం రాగానే అందజేస్తామని చెప్పారు.

వీరి ఎత్తుకు ప్రత్యర్థి చిత్తే..

- చదరంగంపై పెరుగుతున్న ఆసక్తి
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్న చిన్నారులు
- సత్తా చాటుతున్న వైనం

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం): పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు చాలా అవసరం. తరగతిలో గదిలో నేర్చుకునే చదువుతో మంచి మార్కులు వస్తే, ఆటపాటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుంది. తద్వారా అన్ని విషయాలలో ముందంజలో ఉంటారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి విజయ శిఖరాలను అధిరోహిస్తారు. ఆటల్లో చదరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేయడానికి వారు చేసే ఆలోచన.. మెదడును మరింత చురుగ్గా ఉంచుతుంది. తెలివితేటలను పెంచుతుంది. చదరంగంలో నగరంలోని చిన్నారులు, యువత దూసుకుపోతున్నారు. వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటూ, విజయాలను సాధిస్తూ పతకాలను గెలుచుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలోనూ ప్రతిభ చూపుతున్నారు.

హోరాహోరీగా..

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రరంలోని ఐరన్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ హాలులో ఇటీవల జిల్లా స్థాయి ఓపెన్, మహిళల చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీలలో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో విజయం సాధించిన మొదటి నలుగురూ విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే బాలికల విభాగంలో విజయం సాధించిన నలుగురూ ఈ నెల 25, 26 తేదీల్లో హిందూపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. బాలురు విభాగంలో కె.సాకేత్, వై.కల్యాణ్ కుమార్, కె.సీతా సాగర్, ఐ.గోపీకృష్ణ, బాలికల విభాగంలో అక్షయ్ కరక్, రష్మి, రిషిత, కావ్యశ్రీ విజయం సాధించారు.



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

ఒత్తిడి మాయం

చదరంగం ఆడడం వల్ల మెదడు చురుకుగా ఉండి, జ్ఞాపక శక్తి పెరుగుతుంది. విద్యార్థులకు చదువుల కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమవుతుంది. అలాగే సమస్యను అధిగమించడానికి పోటీతత్వం ఏర్పడుతుంది. అతిగా మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం ఒక మంచి ఔషధంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఆలోచనా శక్తి పెంపు



ఆలోచన శక్తిని పెంచుకునేందుకు చదరంగం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాటు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. గతంతో పోలిస్తే ఇప్పుడు చిన్నారులు, యువత చదరంగం ఆవశ్యకతను గుర్తించి , ఆటలోని మెళకువలను నేర్చుకుంటున్నారు.

– **జీవీ కుమార్**, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి

రేపటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

గోదావరి బండ్ రోడ్డులోని వైఎంఏ హాలులో ఆదివారం నుంచి జిల్లాస్థాయి చదరంగం పోటీలు జరగనున్నాయి. జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్- 19 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయి. 1-1-2005 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులు. పాల్గొనే క్రీడాకారులు ఏపీచెస్ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.